క్లుప్తంగా

పంట పొలాల పరిశీలన


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్, చిన్నమెట్‌పల్లి, పైడిమడుగుగు గ్రామాల్లో పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భం రైతులకు పలు జాగ్రత్తలు సూచించారు. మాదాపూర్‌లో ఆయిల్‌ఫాంను పరిశీలించి రైతులు ఆయిల్ ఫాం సాగు చేస్తే ప్రభుత్వం రాయితీ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి ఏడీఏ రమేష్, మండల వ్యవసాయ అధికారి నాగమణి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే సీఎం ధ్యేయం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల: అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్మన్ అడువాల జ్యోతి అన్నారు. శాసన సభలో బీసీ బిల్లు, ఎస్సీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, నాయకులు గిరి నాగభూషణం, నారాయణ, దుమాల తిరుపతి, పవన్ పాల్గొన్నారు.

యాంత్రీకరణ పథకంపై రైతులకు వివరించాలి


మాట్లాడుతున్న ఏవో యోగితా

కథలాపూర్: గ్రామాల్లో వ్యవసాయ యాంత్రీకరణ పథకంపై రైతులకు ఏఈవోలు వివరించాలని కథలాపూర్ ఏవో యోగితా అన్నారు. బుధవారం కథలాపూర్ మండల వ్యవసాయ కార్యాలయంలో ఏఈవోలతో సమావేశం నిర్వహించారు. మండలానికి బ్యాటరీ స్ప్రేయర్లు 6, పవర్ స్ప్రేయర్లు 6, రోటవేటర్లు 3, కల్టివేటర్లు 4 కేటాయించారన్నారు. జిల్లా పరిధిలో ట్రాక్టర్లు 3, పవర్ వీడర్లు 2, స్ట్రా బేలర్లు 2, డ్రోన్ 1 చొప్పున కెటాయించారన్నారు. ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఏఈవోలను సంప్రదించాలన్నారు. సమావేశంలో ఏఈవోలు శేఖర్, హరీశ్, సంధ్య, మౌనిక, సుష్మశ్రీ పాల్గొన్నారు.

గ్రంథాలు చదివితే జ్ఞానం పెరుగుతుంది


గ్రంథాలయాన్ని ప్రారంభించిన గీతాంజలి

ఇబ్రహీంపట్నం: గ్రంథాలు చదివితే జ్ఞానం పెరుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ గీతాంజలి అన్నారు. మండలంలోని వేములకుర్తి న్యూ విజన్ క్యాన్వెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జ్ఞానవాహిని గ్రంథాలయాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మహానుభావుల సంగ్రంథాలు పుస్తకాలు ప్రతీ పిరమిడ్‌లో ఉండేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గుమ్మల తిరుపతి, కిసాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బియ్యం బహిరంగ వేలం

జగిత్యాలరూరల్: జిల్లాలో అక్రమంగా తరలిస్తుండగా.. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ఈనెల 22న బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివిధ కేసుల్లో పట్టుబడిన సుమారు 923.45 క్వింటాళ్ల, అలాగే తినడానికి వీలులేని 22.10 క్వింటాళ్ల బియ్యాన్ని కలెక్టర్ ఆదేశాల మేరకు 22న సాయంత్రం మూడు గంటలకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. టెండర్‌లో పాల్గొనే వారు జిల్లా సివిల్‌సప్లయ్ అధికారి పేరున డీడీ తీయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ టీవీల ప్రాముఖ్యతను వివరించాలని సూచించారు.సైబర్ క్రైమ్, డయల్ 100 పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్పీ వెంట ఎస్సై అనిల్, సిబ్బంది ఉన్నారు.

అడుగడుగునా.. భక్తుల అవస్థలు

- పెద్దాపూర్‌లో మల్లన్న జాతరలో అడ్డగోలు వసూళ్లు
- ప్రేక్షకపాత్ర పోషించిన దేవాదాయ శాఖ



మల్లన్న స్వామికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

కోరుట్ల: భక్తిశ్రద్ధలతో వందలాది కిలోమీటర్ల దూరం నుంచి మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులకు మెట్‌పల్లిలోని పెద్దాపూర్‌లోగల మల్లన్న స్వామి ఆలయ నిర్వహణ కమిటీ శఠగోపం పెట్టింది. ఈ ఆలయం దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నా.. స్థానిక కమిటీ నిర్వాహకులు చెప్పిందే లెక్క. వాస్తవానికి ఈ కమిటీకి 2021లోనే మూడేళ్ల కాలపరిమితి పెంపు గడువు ముగిసింది. అయితే దేవాదాయ శాఖ అధికారుల పట్టింపులేని ఫలితంగా పాత కమిటీ నిర్వహణలోనే ఈ సారి మల్లన్న జాతర సాగింది.

అతిపెద్ద బోనాల జాతర

వాస్తవానికి పెద్దాపూర్‌లోని మల్లన్న స్వామి ఆలయంలో జరిగే ఉత్సవం ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద బోనాల జాతర. ఏటా హోలీ పండుగ మరుసటి ఆదివారం జరిగే ఈ ఉత్సవాలకు అదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, సిరిసిల్ల, పెద్దపల్లి, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి సుమారు లక్ష మంది వరకు భక్తులు వస్తుంటారు. వీరిలో సుమారు 50 వేల మంది మల్లన్నకు బోనాల నైవేద్యం సమర్పిస్తారు. అయితే భక్తులకు సౌకర్యాల కల్పన మాత్రం అంతంతమాత్రంగానే ఉంటోంది. ఆలయానికి వెళ్లే దారుల్లో రోడ్లవెంట, చెట్లకిందనే భక్తులు బోనాలు చేయాల్సి వచ్చింది. అక్కడక్కడ టెంట్లు వేసినా.. అవి భక్తుల రద్దీకి ఏ మాత్రం సరిపోలేదు. ఆలయంలోకి వెళ్లడానికి సరైన క్యూలు లేకపోవడం గమనార్హం. కొబ్బరికాయలు కొట్టడం నుంచి.. గొర్రెపిల్ల మొక్కు చెల్లింపు వరకు ధరలపై ఏమాత్రం నియంత్రణ కనిపించలేదు. క్యూలైన్లు సరిదిద్దడానికి వాలంటీర్లు తక్కువగా ఉండడంతో సామాన్య భక్తులు ఆలయంలో మల్లన్న దర్శనం చేసుకోవడానికి నానా అవస్థలు పడ్డారు.

ఎండోమెంట్ ప్రేక్షకపాత్ర..

2024 జూన్‌లోనే ఆలయ కమిటీ పదవీ కాలం ముగిసింది. వాస్తవానికి ఆలయ నిర్వహణ మొత్తం దేవాదాయ శాఖ పరిధిలోకి రావాల్సి ఉంది. ఈ విషయంలో ఎండోమెంట్ అధికారులు ఆలయ కమిటీకి నోటీసులు ఇచ్చినా ఫలితం కనిపించలేదు. ఈసారి దేవాదాయ శాఖకు సంబంధం లేకుండానే ఆలయ కమిటీ ఆధ్వర్యంలోనే గొర్రెపిల్ల మొక్కులు, పార్కింగ్ ఇతరత్రా టెండర్లు వేయడం గమనార్హం. ఈ విషయంలో ఎండోమెంట్ అధికారి విక్రమ్‌ను వివరణ కోరగా ఆలయ కమిటీ పాలకవర్గం పదవీ కాలం ముగిసిందని, తాము నోటీసులు ఇచ్చినా ఆలయ నిర్వహణ వివరాలు తమకు అప్పగించలేదని, ఎండోమెంట్ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలటౌన్/ధర్మపురి/రాయికల్/ మల్యాల/కథలాపూర్/పెగడపల్లి/మల్లాపూర్/ మేడిపల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు,ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో ఆమోదం పొందడంపై జిల్లా వ్యాప్తంగా బుధవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పలు చోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. రెండు బిల్లుల ఆమోదానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె దవాఖాన పనులు పరిశీలన

సారంగాపూర్: మండలంలోని నాగునూర్‌లో రూ. 20 లక్షలతో చేపట్టిన పల్లె దవాఖాన పనులను బుధవారం జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లచ్చక్కపేటలో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ జమీర్, ఎంపీడీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

బీసీ బిల్లు అభినందనీయం

కోరుట్ల: బీసీ బిల్లు ఆమోదించడం అభినందనీయమని తెలంగాణ ప్రదేశ్ కమిటీ సోషల్ మీడియా కో కన్వీనర్ కట్ట మనోజ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. బీసీలకు సామాజిక, రాజకీయ రంగాల్లో న్యాయం చేసే రీతిలో బీసీ బిల్లు ఆమోదించడం బీసీలకు మేలు చేయాలన్న సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. బీసీ హక్కులను తిరిగి వారికి ఇవ్వడానికి బీసీ బిల్లు దోహదపడుతుందన్నారు. దేశంలోనే బీసీ అత్యధిక రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

స్వయం ఉపాధి యూనిట్ల ఎంపికకు ఇంటర్వ్యూ

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల స్వయం ఉపాధి యూనిట్ల ఎంపికకు బుధవారం మండల అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించారు. మండలంలో 12 మంది దివ్యాంగులు స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, 10 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మణెమ్మ, ఎంపీడీవో శంకర్, ఏపీఎం నరహరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమది బేగం పాల్గొన్నారు.

అవును.. వీరు కథలు చెబుతారు..


ఇంగ్లిష్‌లో కథలు చెప్తూ ప్రతిభ చాటిన విద్యార్థినులు

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఇంగ్లిష్‌లోనూ కథలను అనర్గళంగా చెప్తూ పలువురి మెప్పు పొందుతున్నారు. ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతిలో 12 మంది విద్యార్థులున్నారు. పుస్తకాల్లో చూసి విద్యార్థులు కథలు చదవడం సాధారణం. ఆ పాఠశాల విద్యార్థులు సామాజిక అంశాలతోపాటు ఇతర అంశాల్లోనూ ఇంగ్లిష్‌లో కథలను చెప్పేందుకు ఒకరిని చూసి మరొకరు పోటీ పడుతున్నారు. ఇటీవల పాఠశాలలో ఇంగ్లిష్‌లో కథలు చెప్పడంపై పోటీలు నిర్వహించగా... 10 మంది విద్యార్థులు 15కు పైగా కథలను చెప్పి బహుమతులు అందుకున్నట్లు హెచ్‌ఎం విజయ్ బుధవారం తెలిపారు. విద్యార్థులు కథలను చెప్పడాన్ని వాట్సాప్ గ్రూపుల్లో పెట్టగా.. మండల, జిల్లా అధి కారులు అభినందించారని హెచ్‌ఎం పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మల్యాల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 557 మంది పదో తరగతి విద్యార్థులకు మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల, రామన్నపేట జిల్లా పరిషత్ బాలుర పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ మేరకు సీసీ కెమెరాలుసైతం ఏర్పాటు చేశారు. బుధవారం మల్యాల ఎంఈవో జయసింహారావు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

- **టెన్త్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి**

ఇబ్రహీంపట్నం: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో మధు అన్నారు. బుధవారం ఎమ్మార్సీలో పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షణ అధికారులు, డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలని సూచించారు. హెచ్‌ఎంలు విద్యార్థులకు పరీక్షలపై ఉన్న అపోహలను, భయాలను తొలగించి పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు.

సునీతా విలియమ్స్‌కు చిన్నారుల అభినందనలు



వర్షకొండలో ప్లకార్డులతో చిన్నారుల స్వాగతం

ఇబ్రహీంపట్నం: భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ 9 నెలల తర్వాత బుధవారం భూమి మీదకు వచ్చిన సందర్భంగా మండలంలోని వర్షకొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్లకార్డులను పట్టుకుని స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అచ్చ విజయభాస్కర్, ఉపాధ్యాయులు రమేశ్, నవత, భారతి, రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

- **వైద్యసేవలపై అవగాహన పెంచాలి**

మల్యాల: ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్య సేవలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి మౌనిక అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు నివేదికలు పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, ప్రకాశ్, హెచ్‌ఈవో రమేశ్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

- **సీసీరోడ్డు పనులు ప్రారంభం**

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో బుధవారం ఎల్లమ్మ ఆలయానికి రూ. 20 లక్షలతో ఏర్పాటు చేసే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నల్ల మహిపాల్‌రెడ్డి, జుపెల్లి మల్లేశం, నారపాక రమేశ్, ధర్మపురి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు జోగిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


స్వామివారికి స్వాగతం పలుకుతున్న మహిళలు

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ కనక దుర్గాదేవి ఆలయంలో శ్రీ కనక దుర్గాసేవా మండలి కమిటీ ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి భవాని మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ క్యాతం లక్ష్మారెడ్డి, సభ్యులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఊరేగింపు

జగిత్యాలటౌన్: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం సందర్భంగా బుధవారం పురాణిపేట ఆంజనేయస్వామి ఆలయం నుంచి స్వామి అమ్మవార్లను పట్టణ ప్రధాన వీధుల గుండా పల్లకీలో ఊరేగించి ఆలయానికి చేర్చారు. అనంతరం జగిత్యాల కొత్తబస్టాండ్ సమీపంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

సహస్ర లింగాల దేవాలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామ శివారులోని సహస్ర లింగాల దేవాలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు కొత్త ప్రతాప్‌ను స్వామివారి శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు నలమాసు గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న పట్నాలు, బోనాలు

సారంగాపూర్: మండలంలోని పోతారంలో ఐనవోలు మల్లన్న స్వామి పట్నాలు, అగ్గి గుండాలు, బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో బుధవారం నాగేల్లి పట్నం, అగ్ని గుండాలు, బోనాలు, అన్నదానం జరిగాయి. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంత, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, మాజీ సర్పంచ్ భైరి మల్లేశం, మాజీ విండో చైర్మన్ సాగి సత్యంరావు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు ఏడుమాకెల మల్లేష్, ఉపాధ్యక్షుడు మధు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి రథోత్సవం

కోరుట్ల: పట్టణంలోని ఆదర్శ నగర్‌లో అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. మహిళల కోలాటం, ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రామస్వామి గౌడ్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంత



పెగడపల్లి: మండలంలోని నామాపూర్ బస్టాండ్ ప్రాంతం నుంచి పెగడపల్లి వైపు వచ్చే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఏర్పడిన లోతైనా గుంత ప్రమాదకరంగా ఉంది. గుంత ఏర్పడి వారం రోజులు గడిచినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. గుంత కనిపించక వాహదారులు రాత్రిపూట ప్రమాదబారిన పడే అవకాశ ముందని గుంత పూడ్చివేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఆదిత్య, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్‌ఫోన్ నంబర్: 9502379442

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఏడుగురిపై కేసు నమోదు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మేడిపల్లి శివారులో పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. గ్రామ శివారులో చెరువు కట్ట సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో బుధవారం దాడులు జరిపి, రూ.12,500నగదు,మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.మొత్తం ఏడుగురిపై నమోదు చేయగా,ఇందులో ఐదుగురు పట్టుబడ్డారని మిగతా ఇద్దరు పారిపోయినట్లు పేర్కొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు

జగిత్యాలక్రైం: జగిత్యాలలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన అల్లుడు తమను నమ్మించి మోసం చేసి తమను ఇంటి నుంచి గెంటేశాడని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి హృషికేశ్ బుధవారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సదాశివపురం గ్రామానికి చెందిన యండ్రతి హృషికేశ్ పరిశ్రమల శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. 2012లో తన కుమార్తె తులసి, కుమారుడు క్రాంతికుమార్ పేరుతో హైదరాబాద్ మల్కాజిగిరిలో ఓ భవనాన్ని కొనుగోలు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. దీంతో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న తన అల్లుడు పోగు రవికుమార్ తమను మాయమాటలతో నమ్మించి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, ఇప్పుడు తన కుమారుడు, తనను చంపుతానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన ఎస్పీ దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక అందించాలని అడిషనల్ ఎస్పీ భీంరావును ఆదేశించారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్ గ్రామానికి చెందిన జోగు పవన్‌ను కొట్టి, చంపుతామని బెదిరించి, దూషించిన వ్యక్తులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం పవన్ తల్లి జోగు పద్మ ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పవన్‌పై దాడిచేసి, దూషించిన తండ్రితోపాటు మరికొంత మందిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

మేడిపల్లి: మానసిక సమస్యలతో బాధపడుతూ జీవితం మీద విరక్తితో వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య పాల్పడిన ఘటన మండలంలోని కట్లకుంటలో బుధవారం చోటు చేసుకుంది. గడ్డం బుచ్చిరెడ్డి అనే వృద్ధుడు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, ఇటీవలే భార్య చనిపోగా మానసికంగా కుంగిపోయి బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు హాస్పిటల్ తరలించే సమయంలో మరణించినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

జేబుదొంగను పట్టుకున్న మఫ్టీ పోలీసులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహుని రథోత్సవానికి వచ్చిన ఓ భక్తుడి జేబులోంచి డబ్బులు దొంగిలిస్తుండగా మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బుధవారం స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించగా.. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలానికి చెందిన మాడిశెట్టి సురేందర్ రథోత్సవాన్ని తిలకిస్తుండగా.. ఓ దొంగ సురేందర్ జేబులోంచి డబ్బులు తీసేందుకు ప్రయత్నించాడు. మఫ్టీలో ఉన్న పోలీసులు గమనించి దొంగను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడితో కొంతమంది ముఠా కూడా ఉన్నారని, వారు పరారయ్యారని సమాచారం.

- **పసుపు యంత్రాలను వినియోగించుకోండి**

ఇబ్రహీంపట్నం: రైతులు సబ్సిడీపై ఇచ్చే పసుపు యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ సుందరేషన్ నటరాజన్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెట్(ఎఫ్‌పీవో)కు రూ. 14.50 లక్షల విలువ గల 2 పసుపు ఉడకబెట్టె బాయిలర్‌లు, 2 పసుపు పాలిష్ చేసే యంత్రాలను 90 శాతం సబ్సిడిపై ఎఫ్‌పివో రైతులకు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతు క్యూజీ బిజి పథకం క్రింద ఈ యంత్రాలను అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పైస్‌బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ రాజమాణిక్యం, ఎఫ్‌పీవో సీఈవో శ్రీధర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, ఎఫ్‌పివో డైరెక్టర్లు పాల్గొన్నారు.

- **అభివృద్ధి పనులకు నిధులు మంజూరు**

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీ కోటాలో రూ. 9 లక్షలు మంజూరైనట్లు బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి బుధవారం తెలిపారు. తాండ్ర్యాల, సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో బోరుబావులు, మోటార్ల కోసం రూ. 6 లక్షలు, దూలూర్‌లో రజక సంఘం భవనం కోసం రూ. 3 లక్షలు కేటాయించారని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు బీజేపీ నాయకులు వెంకటేశ్వర్‌రావు, సత్యం, మహేశ్, రవి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం శుభపరిణామం

సారంగాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడం శుభపరిణామని అంబేడ్కర్ సంఘం జిల్లా ప్రధాన పూడూరి శోభన్ అన్నారు. బుధవారం బీర్‌పూర్‌లో మాట్లాడారు. 30 ఏళ్ల పోరాటాల ఫలితంగా ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బీర్‌పూర్ మండల అధ్యక్షుడు సుద్దాల తిరుపతి, గోడిసెల మురళి, పూడూరి నర్సయ్య, రాజేశం, గంగారవి, లక్ష్మణ్, సుధాకర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

- **విద్యుత్ అధికారుల పొలం బాట**

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో విద్యుత్ అధికారులు బుధవారం పొలంబాట నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు విద్యుత్ ప్రమాదాల నివారణ, తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మెట్‌పల్లి డీఈ గంగారాం, కోరుట్ల ఏడీఈ ఆంజనేయులు, ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **మరుగుదొడ్లు ప్రారంభం**

మేడిపల్లి: భీమారం మండలం వెంకట్రావుపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన మరుగుదొడ్లను బుధవారం తహసీల్దార్ రవి కిరణ్, ఎంపీడీవోలు పద్మజ, నీరజ తో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో భీమారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్ కుమార్, ఈసీ నవీన్, హెచ్‌ఎం రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

- **అదుపుతప్పి కారు బోల్తా**

మేడిపల్లి: మండలంలోని రంగాపూర్-కొండాపూర్ గ్రామాల మధ్య బుదవారం కారు అదుపుతప్పి పక్కన ఉన్న కాలువలో బోల్తా పడింది. ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కథలాపూర్ మండలంలోని బొమ్మెన గ్రామానికి చెందిన అంజిరెడ్డి వ్యక్తిగత పనులపై మేడిపల్లి వైపు వెలుతుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

రాయికల్: మండలంలోని ఒడ్డెలింగాపూర్‌కు చెందిన సూర సాగర్ అనారోగ్యంతో బాధపడుతుండగా, మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చొరవతో రూ.2.50 లక్షల ఎల్‌వోసీని బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.